మెయిన్
# టీ-మీడియా
సామాజికం.. ప్రజల పక్షం...

సంపుటి : 8
సంచిక : 233
పేజీలు : 3


గురువారం
26.03.2026

GSTIN:36FDKPS1308P1ZX | Digital, tmedia.net.in

ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ

## ఘోర రోడ్డు ప్రమాదం

**- యువ నటి మృతి**



**టి మీడియా, మార్చి 25 , జైపూర్ :** రాజస్థాన్ రాజధాని జైపూర్లో సోమవారం రాత్రి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో యువ నటి, మోడల్ హర్షిల్ కాలియా (30) ప్రాణాలు కోల్పోయారు. ఈ విషాద ఘటన షిప్రా పాత్ రోడ్డులో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం, హర్షిల్ కాలియా తన పనులు ముగించుకుని రాత్రి సుమారు 11:30 గంటల సమయంలో ఇంటికి కారులో వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఆమె ప్రయాణిస్తున్న కారు ఒక్కసారిగా నియంత్రణ కోల్పోయి రోడ్డుపై ఉన్న డివైడర్ను బలంగా ఢీకొట్టింది. ఢీకొట్టిన వేగానికి కారు పల్టీలు కొట్టి బోల్తా పడింది. ఈ ప్రమాదానికి సంబంధించిన సీసీటీవీ దృశ్యాలు ప్రస్తుతం బయటకు వచ్చాయి. వాటిలో కారు వేగంగా వచ్చి డివైడర్ను ఢీకొట్టి ఎడమ వైపుకు పల్టీలు కొడుతూ బోల్తా పడిన దృశ్యాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఈ వీడియోలు ప్రమాద తీవ్రతను స్పష్టం చేస్తున్నాయి.ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు స్పందించి కారునుండి హర్షిల్ను బయటకు తీశారు. తీవ్రమైన తల గాయాలతో ఆమెను సమీపంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అయితే అక్కడికి చేరుకునే సరికి పరిస్థితి విషమించడంతో వైద్యులు ఆమె మరణించినట్లు ప్రకటించారు.

## ‘విదేశీ విద్య’ సాయం ఏదీ?

### 2,500 మంది ఎదురుచూపు

- **బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**



**టి మీడియా, మార్చి 25 ,హైదరాబాద్ :**విదేశీ విద్యా పథకం’ కింద ఆర్థిక సహాయం కోసం దాదాపు 2,500 మంది విద్యార్థులు ఎదురుచూస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. విదేశీ విద్యా పథకం కింద విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై మంగళవారం అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సమయంలో కేటీఆర్ మాట్లాడారు.విదేశాల్లో ఉన్న విద్యార్థులు ఫస్ట్ సెమిస్టర్ ఫీజులు చెల్లించి, సెకండ్ సెమిస్టర్ ఫీజులు చెల్లించలేక ఇబ్బందులు పడుతూ తమకు సందేశాలు పంపుతున్నారని వెల్లడించారు. 2025 అక్టోబర్లో విదేశీ విద్యకు సంబంధించి రూ.303 కోట్లు విడుదల చేస్తున్నామని ప్రభుత్వం ప్రకటించిం దని, కానీ ఇప్పటివరకు ఆ నిధులు విడుదల కాలేదని విమర్శించారు.బీఆర్ఎస్ హయాం లో ‘ఓవర్సీస్ విద్యా నిధి’ ద్వారా వేలాది దళిత, గిరిజన, వెనుకబడిన తరగతుల విద్యార్థులు విదేశాల్లో గౌరవప్రదంగాచదువుకున్నారని, సుమారు 7 వేల మంది విద్యా ర్థులకు ఒక్కొక్కరికి రూ.20 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందించామని గుర్తు చేశా రు. ప్రస్తుతం అమెరికా, లండన్, జర్మనీ వం టి దేశాల్లో ఉన్న తెలంగాణ విద్యార్థులు అనే క కష్టాలు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా వార్తలుబీఆర్ఎస్ ప్రభుత్వ హయాం లో విదేశీ విద్యా పథకం కింద వెళ్లామని, కానీ ఇప్పటివరకు డబ్బులు రాలేదని, దయచేసి అసెంబ్లీలో ఈ విషయం ప్రస్తావిం చాలని విద్యార్థులు విజ్ఞప్తి చేస్తున్న విషయా న్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు. ప్రభు త్వం, సీఎం ఈ అంశాన్ని అత్యంత ప్రాధాన్యతగా తీసుకుని, గ్రీన్ ఛానల్లో పెట్టి నిధు లను విడుదల చేయాలని కోరారు.కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన మౌలానా అబుల్ కలాం తాలీమ్- పథకం కూడా ఇప్పటివరకు అమలులోకి రాలేదన్నారు. 10వ తర గతి పాస్ అయితే రూ.10 వేలు, ఇంటర్ పా స్ అయితే రూ.15 వేలు, డిగ్రీ పాస్ అయితే రూ.25 వేలు ఇస్తామని చేసిన హామీలను కూడా గుర్తు చేశారు.

## భట్టి విక్రమార్కను కలిసిన కేటీఆర్..

**-నేతన్నల కష్టాలపై వినతి పత్రం**



**టి మీడియా, మార్చి 25 ,హైదరాబాద్:** సిరిసిల్ల వస్త్ర పరిశ్రమనుచుట్టుముట్టిన విద్యుత్ సంక్షోభం నుంచి నేతన్నలను కాపాడాలని కోరుతూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎల్ రమణతో పాటు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కలిశాను. సిరిసిల్ల పవర్లూమ్ యూనిట్లపై ఉన్న విద్యుత్ బకాయిలు, సర్చార్జిల భారంపై సమగ్రమైన వినతి పత్రాన్ని అందజేసి, వాటిని మాఫీ చేయాలని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 25 హెచ్.పీ వరకు విద్యుత్ సబ్సిడీ పెంచడం వల్ల పరిశ్రమ నిలదొక్కుకుందన్న కేటీఆర్ ప్రస్తుతం విద్యుత్ అధికారులు విధిస్తున్న బ్యాక్ బిల్లింగ్భారం వల్ల వేలాది కుటుంబాల జీవనోపాధి ప్రమాదంలో పడిందని వివరించారు. 2016 నుండి 2024 వరకు ఉన్న సుమారు 127 ఎస్.ఎస్.ఐ యూనిట్లపై అధికారులు రూ. 19 కోట్ల బ్యాక్ బిల్లింగ్ భారం మోపారని తెలిపారు.అది సర్చార్జిలతో కలిపి ఇప్పుడు రూ. 38 కోట్లకు చేరిందని పేర్కొన్నారు. ఈ భారీ బకాయిలను చెల్లించలేక అనేక యూనిట్లు మూతపడటంతో పాటు, ఇటీవల కాలంలో ఆర్థిక ఇబ్బందులతో 13 మంది కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడటం అత్యంత బాధాకరమని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ బిల్లుల భారాన్ని మానవీయ కోణంలో రద్దు చేసి తెలంగాణ నేతన్నలను అదుకోవాలని కేటీఆర్ ఉప ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు.

# అమెరికా నౌకపై...
# ఇరాన్ దాడి



- **వార్నింగ్ ఇచ్చిన గంటలోపే ఎటాక్?**
- **కాల్పుల విరమణ ప్రతిపాదించిన ఇరా**

**టి మీడియా, మార్చి 25 , ఢిల్లీ బ్యూరో :**అమెరికాకు చెందిన భారీ యుద్ధవిమాన వాహక నౌకఅబ్రహం లింకన్ లక్ష్యంగా ఇరాన్ క్రూయిజ్ క్షిపణులను ప్రయోగించింది. తీర ప్రాంతం నుంచి ప్రయోగించే అత్యాధునిక ‘ఖాదర్’ యాంటీ-షిప్ క్రూయిజ్ క్షిపణులను అబ్రహం లింకన్పైకి ప్రయోగించింది. తమ దాడుల తీవ్రత తప్పించుకునేందుకు ఆ భారీ నౌక తన స్థానం మార్చుకుందని టెహ్రాన్ పేర్కొంది. తమ సముద్ర జలాలపై సార్వభౌమాధికారాన్ని చాటుకునేందుకే ఈ దాడి చేసినట్లు ఇరాన్ స్పష్టం చేసింది. తమ క్షిపణి పరిధిలోకి వస్తే మరిన్ని దాడులు చేస్తామని ఇరాన్ హెచ్చరించిన గంటలోనే ఎటాక్? చేసింది.పశ్చిమాసియా యుద్ధ ఉద్రిక్తతల నేపథ్యంలో ఇరాన్ హర్మూజ్ జలసంధిలో నౌకాయానానికి సంబంధించి పలు నిబంధనలు విధించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో హర్మూజ్ నుంచి కరాచీకి వెళ్తున్న పాకిస్థాన్? కంటైనర్ నౌక (సెలెన్)ను వెనక్కి రప్పించినట్లు ఐఆర్జీసీ వెల్లడించింది. హర్మూజ్ గుండా ప్రయాణించడానికి ముందస్తు అనుమతులు లేకపోవడమే ఇందుకు కారణమని పేర్కొంది. ఈ జలసంధి గుండా వెళ్లే ప్రతి నౌక ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్ సముద్ర అధికార యంత్రాంగంతో సమన్వయం చేసుకోవాలని ఐఆర్జీసీ ఇంతకు ముందే ప్రకటించింది.కాగా, పాకిస్థాన్? కంటైనర్? నౌకను ఇరాన్ అడ్డుకున్న విషయాన్ని కాబుల్లోని ఇరాన్ రాయబార కార్యాలయం కూడా ధ్రువీకరించింది. ఇరాన్-అమెరికా మధ్య శాంతి చర్చలకు పాకిస్థాన్ వేదికగా కానున్నదని వార్తలు వస్తున్న నేపథ్యంలో ఈ ఘటన జరగడం గమనార్హం.మరోవైపు ఇరాన్? దాడిపై అమెరికా ఎలా స్పందిస్తుందనే దానిపై ఆందోళన నెలకొంది. కాగా, అబ్రహాం లింకన్పై దాడి చేశామని ఇరాన్ ప్రకటించడం ఇదే తొలిసారి కాదు. తమ బాలిస్టిక్ క్షిపణులు ఈ నౌకను ఢీకొట్టాయని, దాంతో అది పనిచేయడం లేదని, గల్ఫ్ జలాల నుంచి వెనక్కి తగ్గిందని ఇటీవల చెప్పింది. కానీ, ఆ ప్రకటనను అప్పట్లో అమెరికా తోసిపుచ్చింది. అటు యుద్ధాన్ని ముగించేందుకు ఇరాన్తో అమెరికా ముమ్మరంగా చర్చలు జరుపుతోంది. ఇందులో భాగంగానే నెల రోజుల కాల్పుల విరమణ కోసం 15 పాయింట్లతో కూడిన ప్రణాళికను ఇరాన్కు పాకిస్థాన్ అందించింది. ఇలాంటి సమయంలో తాజా ఘటన చోటుచేసుకోవడం గమనార్హం.

**అమెరికాకు స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చిన ఇరాన్**


అంతకుముందు పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతల వేళ అమెరికాకు స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చింది ఇరాన్. అమెరికా విమాన వాహక యూఎస్ఎస్ అబ్రహం లింకన్పై గట్టి నిఘా ఉంచామని తెలిపింది. ఒకవేళ అది ఇరాన్ భూభాగానికి సమీపిస్తే తీవ్రమైన దాడులు ఎదుర్కొనే అవకాశం ఉందని ఇరాన్ నౌకాదళం అమెరికాను హెచ్చరించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రసార సంస్థ ప్రెస్ టీవీ ప్రసారం చేసింది. దీని ప్రకారం, ఇరాన్ క్షిపణి వ్యవస్థల పరిధిలోకి ప్రవేశిస్తే ఆర్మీ నేవీ యూఎస్ఎస్ అబ్రహం లింకన్?ను లక్ష్యంగా చేసుకుంటామని ఇరాన్ నౌకాదళ కమాండర్ రియర్ అడ్మిరల్ షహ్రామ్ ఇరానీ హెచ్చరించారు.

**‘అమెరికా పొందిన ఓటమిని ఒక ఒప్పందంగా పిలువవద్దు’**

మరోవైపు అమెరికాపై తీవ్ర విమర్శలు గుప్పించారు ఇరాన్ లెఫ్టినెంట్ కల్నల్ ఇబ్రహీం జోల్ఫఖారీ. ఇరాన్?తో అమెరికా చేస్తున్న దౌత్య ప్రయత్నాలు ఒక బూటకమని వ్యాఖ్యానించారు. అమెరికా ప్రదర్శించిన వ్యూహాత్మక శక్తి ఇప్పుడు ఓటమిగా మారిందని ఎద్దేవా చేశారు. స్వయం ప్రకటిత అగ్రరాజ్యమైన అమెరికా పూర్తిగా ఓటమి పాలైందని ఆరోపించారు. అమెరికా పొందిన ఓటమిని ఒక ఒప్పందంగా పిలువవద్దు అని విమర్శించారు. ట్రంప్? 48గంటల అల్టిమేటం నుంచి వెనక్కు తగ్గిన నేపథ్యంలో ఇరాన్? కీలక వ్యాఖ్యలు చేసింది.

## విద్యుత్ కొనుగోలు వ్యయం తగ్గాల్సిందే

**-సీఎం చంద్రబాబు**



**టి మీడియా, మార్చి 25 , అమరావతి :**విద్యుత్ కొనుగోలు వ్యయాన్ని తగ్గించడంపై సమగ్రంగా దృష్టి సారించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ఇప్పటికే ఈ దిశగా చేపడుతున్న చర్యలను మరింత ముమ్మరం చేయాలని స్పష్టం చేశారు. సచివాలయంలో విద్యుత్ రంగంపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో సీఎం చంద్రబాబు ఈ వ్యాఖ్యలు చేశారు. విద్యుత్ కొనుగోలు యూనిట్ వ్యయాన్ని రూ.4కు తగ్గించేలా, అదే సమయంలో ప్రజలపై అదనపు ఛార్జీల భారం మోపకుండానే విద్యుత్ సంస్థలు తమ రుణాలను తిరిగి చెల్లించేలా ఒక కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

**సమర్థ నిర్వహణతో రూ.339 కోట్లు ఆదా**

సాంకేతికత, ఆవిష్కరణల వినియోగంతో పొదుపు చర్యలు చేపట్టాలి అన్నారు. సమర్థవంతమైన నిర్వహణ కారణంగా 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఇప్పటికే సుమారు రూ.339 కోట్ల మేర ఆదా చేశామని, ఈ తరహా పొదుపు చర్యలను మరింతగా చేపట్టాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఇప్పుడు ఈ రంగంలో అనేక మార్పులు వస్తున్నాయని, ప్రపంచం గ్రీన్ ఎనర్జీ వైపు అడుగులు వేస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. రాబోయే రోజుల్లో విద్యుత్ రంగం గేమ్? ఛేంజర్? కానుందన్నారు.ప్రపంచ దేశాలు తక్కువ ఖర్చుతో పర్యావరణహిత ఉత్పత్తికి ఎంతగానో మొగ్గు చూపుతున్నాయని అధికారులకు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ అవకాశాలనుఅందిపుచ్చుకోవడం వల్లే గూగుల్ వంటి కంపెనీలు ఇక్కడ తమ ఉనికిని చాటుకోగలిగాయని ఆయన పేర్కొన్నారు. పీఎం సూర్య ఘర్ పథకం కింద రూఫ్?టాఫ్ ప్రాజెక్టుల ద్వారా విద్యుత్ ఉత్పత్తిపై దృష్టి సారించాలిని సీఎం అన్నారు.”పీఎం కుసుమ్?” పై రైతులకు అవగాహన కల్పించాలని దిశానిర్దేశం చేశారు.

**ప్రజలపై భారం వేయకుండా అప్పులు తీర్చేలా**

సౌర విద్యుత్ ఉత్పత్తి విషయంలో మన దేశంలోనే మొట్టమొదటి స్థానంలో ఉండేలా చర్యలు ఉండేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. వీటితో పంప్ స్టోరేజీ ప్రాజెక్టులు, పవన విద్యుత్ (విండ్ ఎనర్జీ), బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టం వంటి ప్రాజెక్టులను ఇంటిగ్రేట్ చేసుకోవాలనన్నారు. విద్యుత్ రంగంలోని టెక్నాలజీలను, ఇన్నోవేషన్లను ప్రోత్సహించేందుకు ఎనర్జీ యూనివర్శిటీని ఏర్పాటు చేయాలని ఆయన ప్రతిపాదించారు. విద్యుత్ సంస్థలపై రుణ భారం అత్యధికంగా పెరిగిందని ముఖ్యమంత్రి పేర్కొంటూ, ప్రజలపై ఎటువంటి ఆర్థిక భారం మోపకుండానే సంస్థలే ఈ రుణాలను తీర్చేలా ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ట్రూ అప్ ఛార్జీల భారం ప్రజలపై పడకుండా చూసేందుకు ఇప్పటికే తగిన చర్యలు తీసుకున్నామని సీఎం చంద్రబాబు తెలిపారు.

**ఎనర్జీ యూనివర్సిటీని ఏర్పాటు**

సాంకేతికత అందిపుచ్చుకునేందుకు ఏర్పాటు చేసిన సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ ఎనర్జీ ట్రాన్సిషన్ ను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. విద్యుత్ రంగంలో సాంకేతిక పురోగతిని, ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు ఎనర్జీ యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని సూచించారు. మంచి ఆలోచనలతో ముందుకు వచ్చే స్టార్టప్ సంస్థలకు అవసరమైన ‘మార్జిన్ మనీ’ మద్దతును అందించేందుకు విద్యుత్ సంస్థలు తగిన చర్యలు చేపట్టాలని ఆయన స్పష్టం చేశారు. ఈ ఉద్దేశంతో ఒక “ఇంక్యుబేషన్ ఫండ్”ని ఏర్పాటు చేయాలని సీఎం అన్నారు.2028-29 నాటికి విద్యుత్ కొనుగోలు యూనిట్ ధరను రూ.4.10కి తగ్గించే దిశగా చర్యలు ప్రారంభించినట్లు అధికారులు ముఖ్యమంత్రి చంద్రబాబుకు వివరించారు. ఈ సమావేశంలో మంత్రి గొట్టిపాటి రవికుమార్, ముఖ్యమంత్రి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి విజయనంద్, డిస్కం(విద్యుత్ పంపిణీ సంస్థ)ల సీఎండీలు, విద్యుత్ శాఖకు చెందిన సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

## హర్మూజ్ సంక్షోభం వేళ కేంద్రం కీలక నిర్ణయం

- **గ్యాస్ పైప్లైన్ విస్తరణకు కొత్త ఆదేశాలు**



**టి మీడియా, మార్చి 25 , ఢిల్లీ బ్యూరో :** పశ్చిమాసియా ఉద్రిక్తతలు, హర్మూజ్? జలసంధి వద్ద ఏర్పడిన అంతరాయం కారణం వల్ల ప్రపంచ దేశాలు చమురు సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి. ఈ క్రమంలో దేశీయ ఇంధన భద్రతను బలోపేతం చేయడానికి కేంద్రం ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. సహజ వాయువు, పెట్రోలియం ఉత్పత్తుల పంపిణీకి సంబంధించిన పైప్లైన్ల నిర్మాణాన్ని వేగవంతం చేయడానికి కొత్త ఉత్తర్వులు జారీ చేసింది.గల్ఫ్ ప్రాంతంలో ఉద్రిక్తతలు, అలాగే హర్మూజ్ వద్ద ఏర్పడిన అంతరాయాల కారణంగా తీసుకున్న నిర్ణయంగా ప్రభుత్వం తెలిపింది. దేశవ్యాప్తంగా పైప్?లైన్? ప్రాజెక్టుల్లో ప్రధాన సమస్యగా ఉన్న అనుమతుల ఆలస్యం, భూసేకరణ సమస్యలను పరిష్కరించేందుకు కొత్త విధానాన్ని కేంద్రం తీసుకొచ్చింది. అనుమతుల కోసం స్థిరమైన టైమ్?లైన్, పారదర్శక, పెట్టుబడిదారులకు అనుకూలమైన విధానాన్ని కూడా ఇది అందిస్తుంది. కొత్త డిస్ట్రిబ్యూషన్ ఆర్డర్? ద్వారా అన్ని అనుమతులకు ఒకే విధమైన ప్రమాణాలు, కాలపరిమితులు అమలు చేస్తారు. దీంతో సమయానికి అనుమతులు లభించేలా చర్యలు తీసుకుంటారు.

**అధికారుల ఆలస్యాలకు చెక్**

అయితే నిర్ణీత కాలంలో స్పందన లేకపోతే ‘డీమ్డ్ అప్రూవల్’ అనే విధానాన్ని కూడా ప్రవేశపెట్టారు. నిర్ణీత గడువులో సంబంధిత అధికారి స్పందించకపోతే డీమ్డ్? అప్రూవల్ నిబంధన కింద ఆటోమేటిక్?గా ఆమోదం లభించినట్లే అవుతుంది. ఈ చర్యల వల్ల పైప్?లైన్ నిర్మాణ సంస్థలకు ఎదురవుతున్న ఆలస్యాలు, అనిశ్చితి గణనీయంగా తగ్గుతాయని అధికారులు తెలిపారు. రాష్ట్రాలు, స్థానిక సంస్థలు మధ్య ఒకే విధమైన సమగ్ర వ్యవస్థను తీసుకురావడం ద్వారా ప్రాజెక్టులు వేగంగా పూర్తయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు.

**గ్యాస్ మౌలిక వసతులకు పెద్ద ఊతం**

కొత్త ఆదేశాల వల్ల దేశవ్యాప్తంగా గ్యాస్ మౌలిక వసతుల అభివృద్ధి వేగవంతం కానుంది. సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ (సీజీడీ) నెట్వర్క్ విస్తరణ ట్రంక్ పైప్లైన్ల నిర్మాణానికి ఊతం లభించనుంది. దీని ద్వారా లాస్ట్? మైల్? కనెక్టివిటీ మెరుగుపడి గృహాలు, పరిశ్రమలు, రవాణా రంగాలకు పైప్?లైన్ గ్యాస్ సరఫరా మరింత సులభంగా అందుబాటులోకి రానుంది.

**‘డిగ్ అండ్ రిస్టోర్’ విధానం**

పైప్లైన్ పనుల వల్ల ప్రజలకు కలిగే ఇబ్బందులను తగ్గించేందుకు ‘డిగ్ అండ్ రిస్టోర్’ లేదా ‘డిగ్? అండ్ పే’ విధానం ప్రవేశపెట్టారు. దీని ద్వారా భూమి యజమానులకు, స్థానిక సంస్థలకు నష్టపరిహారం, పునరుద్ధరణపై స్పష్టమైన నిబంధనలు అమలు చేస్తారు. దీంతో ఆస్తి, పర్యావరణానికి కలిగే అంతరాయాలపై ప్రజల్లో ఉన్న ఆందోళనలు తగ్గే అవకాశం ఉంది.

**ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్పై ప్రత్యేక దృష్టి**

ఈ కొత్త విధానం ద్వారా ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ మరింత మెరుగుపడుతుందని కేంద్రం భావిస్తోంది. కొత్త ఆదేశం ప్రకారం అమలు ప్రక్రియను మరింత సరళీకృతం చేసి, పెట్టుబడిదారులకు అనుకూల వాతావరణాన్ని సృష్టించేందుకు చర్యలు తీసుకోనున్నారు. అంతేకాకుండా ప్రాజెక్ట్ డెవలపర్?లపై అధిక ఆర్థిక భారం పడకుండా బ్యాంకు గ్యారంటీ వంటి రక్షణ చర్యలను ప్రవేశపెట్టారు.

**వినియోగదారులకు ప్రయోజనాలు**

ఈ ఆదేశం ద్వారా వినియోగదారులకు వేగంగా పైప్?లైన్ గ్యాస్ కనెక్షన్లు అందుబాటులోకి రానున్నాయి. అలాగే, అందుబాటులో ఉన్న ప్రాంతాల్లో గృహాలను క్రమంగా ఎల్?పీజీ నుంచి పైప్లైన్ గ్యాస్కి మార్పు చేయాలని ప్రణాళికలు రూపొందించారు. పైప్లైన్ కనెక్టివిటీ లేని ప్రాంతాల్లో కూడా వినియోగదారులు ఇబ్బంది పడకుండా ఉండేలా సరఫరాలో సౌలభ్యం కల్పించే విధానాలు కూడా ఉన్నాయి. పైప్లైన్ నిర్మాణానికి సంబంధించి స్థానిక సంస్థలు అనవసరంగా అనుమతులను నిరాకరించకుండా నిరోధించే నిబంధనలు ఇందులో ఉన్నాయి. అలాగే, ప్రాజెక్టులకు సంబంధించిన వివాదాలను తగ్గించేందుకు ప్రత్యేక అధికారుల ద్వారా పారదర్శకమైన వివాద పరిష్కార వ్యవస్థను కూడా ఏర్పాటు చేశారు.

**మత సామరస్యానికి ప్రతీకగా మూసీ**

3లో..


**కాంగ్రెస్ పార్టీకి మాజీ మంత్రి జీవన్ రెడ్డి రాజీనామా**

3లో..

# డివిజన్లు, వార్డుల పునర్విభజనకు పచ్చజెండా

## • 927 వరకు పెరిగే ఛాన్స్?

**టి మీడియా, మార్చి 25 , అమరావతి :** రాష్ట్రవ్యాప్తంగా పట్టణప్రాంతాల్లో స్థానిక డివిజన్లు, వార్డులు పునర్విభజన కానున్నాయి. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం కీలక ఘట్టాన్ని చేపట్టింది. జనాభా ప్రాతిపదికన స్థానిక ప్రజాప్రతినిధు లను నియమించేలా చర్యలు తీసుకుంది. జనాభా పెరిగిన పట్టణాలు, నగరపంచాయతీల్లో డివిజన్లు, వార్డులసంఖ్య గణనీయంగా పెరగనున్నట్లు సంబంధిత అధికారులు తెలుపుతున్నారు.



927 వార్డులు: రాష్ట్రవ్యాప్తంగా పుర, నగరపాలక సంస్థలు , నగర పంచాయతీల్లో డివిజన్లు, వార్డుల పునర్విభజనకు రాష్ట్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. 2011 జనాభా లెక్కల ఆధారంగా డివిజన్లు, వార్డుల పునర్విభజించాలని నిర్ణయించిన ప్రభుత్వం ఈ మేరకు కీలక ఆదేశాలు జారీ చేసింది. గ్రేడ్ల ఆధారంగా ఇప్పటివరకు పుర, నగరపారక సంస్థలను వర్గీకరించగా ఇప్పుడు జనాభా ప్రామాణికంగా వర్గీకరించనున్నారు. ఈ మేరకు నగరపాలక సంస్థలు, పురపాలక సంఘాలు, నగర పంచాయతీలకు ప్రభుత్వం వేర్వేరుగా నోటిఫికేషన్లు ఇచ్చింది. తాజా నిర్ణయం ప్రకారం రాష్ట్రంలో డివిజన్లు, వార్డులు 927 వరకు పెరుగుతాయని అంచనా.

3,916 డివిజన్లు: రాష్ట్రంలో అత్యధిక పుర, నగరపాలక సంస్థల్లో పాలకవర్గాల పదవీకాలం ఇటీవల ముగియడంతో ప్రత్యేక అధికారుల పాలన అమల్లోకి తెచ్చింది. త్వరలో ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఈ క్రమంలోనే డివిజన్లు, వార్డుల పునర్విభజనకు పురపాలకశాఖ కమిషనర్ చేసిన ప్రతిపాదనలను ప్రభుత్వం ఆమోదించింది. దీంతో రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న 3,916 డివిజన్లు, వార్డుల సంఖ్య 4,843కి పెరగనుందని అంచనా వేసింది.

నగరపాలక సంస్థల్లో వార్డుల పునర్విభజన
జనాభా డివిజన్ల సంఖ్య:
2 లక్షలలోపు 60,2 లక్షలపైన 3 లక్షలలోపు
62,3 లక్షలపైన 4 లక్షలలోపు 66,
4 లక్షలపైన 5 లక్షలలోపు 68,5
లక్షలపైన 6 లక్షలలోపు 72,6 లక్షలపైన
10 లక్షలలోపు 76,10 లక్షలపైన
15 లక్షలలోపు 86,15 లక్షలపైన
120.

పురపాలక సంఘాలు, నగర పంచాయతీల్లో జనాభా ఆధారంగా వార్డుల పునర్విభజన.
జనాభా వార్డుల సంఖ్య:
30 వేల జనాభాలోపు 23,30 వేలపైన
40 వేల లోపు 28,40 వేలపైన
50 వేల లోపు 32,50 వేలపైన
60 వేల లోపు 36,60 వేలపైన
80 వేల లోపు 40,
80 వేలపైన లక్షలోపు 44,లక్షలోపు
1.50 లక్షలలోపు 48,1.50
లక్షలపైన 52,

2011 జనాభా లెక్కల ఆధారంగా డివిజన్లు, వార్డుల సంఖ్య నిర్ణయించగా తదుపరి జనగణన ఫలితాలు వెలువడే వరకూ మార్చకూడదని నిబంధన విధించింది. పాలకవర్గాలు ఉన్నచోట పదవీకాలం ముగిసిన తర్వాతే కొత్తగా పెరిగిన డివిజన్లు, వార్డులు అమలులోకి వస్తాయని ఆదేశాల్లో స్పష్టం చేసింది.

# అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి-జిల్లా కలెక్టర్





**టి మీడియా, మార్చి 25, ఎండపల్లి :**జిల్లాలో కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా, నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన ఎండపల్లి, వెల్గటూర్ మండలాల్లో విస్తృతంగా పర్యటించారు.ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక' 99 రోజుల కార్యాచరణలో భాగంగా జరుగుతున్న పలు అభివృద్ధి పనులను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఎండపల్లి మండలం పాత గూడూరులోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలను సందర్శించి, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, బోధన తీరును తెలుసుకున్నారు.అలాగే పాత గూడూరు, వెల్గటూర్ మండలం సంకెనపల్లిలో నిర్మాణ దశలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించి, లబ్ధిదారులకు ఇబ్బందులు కలగకుండా నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.వెల్గటూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసి, రోగులకు , ప్రజలకు మెరుగైన వైద్యం అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని స్పష్టం చేశారు.ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక అమలులో ఎలాంటి అలసత్వాన్ని సహించం. ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా చూడాలి అని పేర్కొన్నారు.ఈ పర్యటనలో జిల్లా విద్యాశాఖ అధికారి కె. రాము, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కె. సుజాత, డీపీవో మదన్ మోహన్, హౌసింగ్ పీడీ ప్రసాద్, ఈఈపీఆర్ లక్ష్మణ్ రావు, ఎండపల్లి తహసీల్దార్ ఎడ్ల అనిల్ కుమార్, వెల్గటూర్ తహసీల్దార్ ఆర్. శేఖర్, ఎంపీడీవోలు నరేష్ కుమార్, కృపాకర్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# మిషన్ భగీరథ ప్లాంట్ సందర్శించిన మాజీ మంత్రి





**టీ మీడియా, మార్చి 25, వనపర్తి బ్యూరో :** మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి రెవెల్లి మండలం గౌరీదేవిపల్లి దగ్గర ఉన్న మిషన్ భగీరథ ప్లాంటును సందర్శించి వేసవిలో మంచినీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.ఈ సందర్భంగా నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ దేశంలోనే ఆదర్శమైన మిషన్ భగీరథ పథకం కె.సి.ఆర్ అమలు చేసి మంచినీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకున్నారని కొనియాడారు.గౌరీదేవిపల్లి మిషన్ భగీరథ పథకం ఉమ్మడి పాలమూరు, రంగారెడ్డి జిల్లాలలో 17నియోజకవర్గాలకు వరప్రదాయినిగా నిలిచిందని కొనియాడారు.కె.ఎల్.ఐ పథకంలో అంతర్భాగమైన ఏలూరు రిజర్వాయర్ ద్వారా రా నీటిని పంపింగ్ చేసి శుద్ధి చేసిన మంచినీటిని ప్రజలకు అందించామని అన్నారు. దీనికి సమాంతరంగా వనపర్తికి మంచి నీళ్లను అందించే స్కీమ్ కూడా ఇక్కడే ఉందని పేర్కొన్నారు. దేశంలోనే ప్రతిష్ఠ తెచ్చుకున్న మిషన్ భగీరథ పథకానికి నిర్వహణ సామర్థ్యం లేక కరెంట్ కోతలతో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు.ప్రభుత్వ సమర్థత వల్ల వనపర్తి జిల్లా కేంద్రములో పలుచోట్ల నీటి ఎద్దడి ఏర్పడి ప్రజలు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.దప్రభుత్వం కొత్త పథకాలు అమలు చేయలేకపోయిన గతములో ఉన్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని హితవు పలికారు. నిరంజన్ రెడ్డి వెంట గట్టు యాదవ్ వాకిటి శ్రీధర్ నందిమల్ల . అశోక్,భీమన్న, మధుసూదన్ రెడ్డి,సురేందర్ రెడ్డి,శివరామ్ రెడ్డి వివిధ మండలాల మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

## అక్రమ నిర్మాణాల తొలగింపు

-- మున్సిపాలిటీ చర్యలు



**టీ మీడియా, మార్చి 25, ఆత్మకూర్:**ఆత్మకూర్ పట్టణంలో అక్రమంగా వెలిసిన డబ్బాలను మున్సిపాలిటీ సిబ్బంది తొలగించారు. మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.మున్సిపల్ చైర్‌పర్సన్ గోపాల నాగమణి రాజేష్, వైస్ చైర్మన్ నల్గొండ శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్ చికిని శశిధర్ ఆధ్వర్యంలో ఆత్మకూర్-- అమరచింత రోడ్డుపై అక్రమంగా ఏర్పాటు చేసిన డబ్బాలను తొలగించారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, పట్టణ అభివృద్ధి కోసం ప్రజలు సహకరించాలని కోరారు. అక్రమ నిర్మాణాలు ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తాయని, వాటి తొలగింపుతో రహదారి సౌకర్యం మెరుగుపడుతుందని తెలిపారు.పట్టణ అభివృద్ధికి అందరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు కోట్ల తిరుపతి, చెట్ల లలిత రాజు, శంకరమ్మ బాలరాజు, దండు శ్రీనివాసులు, పుల్లరి భరత్, జిందే జ్యోతి శ్రీనివాస్, సద్దాల తులసి వెంకట్రాములు, జుబేధా భేగం తదితరులు మరియు మున్సిపాలిటీ సిబ్బంది పాల్గొన్నారు.

## భవిత కేంద్రం సేవలు వినియోగించుకోవాలి

జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్



**టీ మీడియా, మార్చి 25, రాజన్న సిరిసిల్ల:** దివ్యాంగ విద్యార్థులు భవిత కేంద్రం సేవలు వినియోగించుకోవాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ పేర్కొన్నారు. ఎల్లారెడ్డిపేట మండలకేంద్రంలో భవిత కేంద్రాన్ని కలెక్టర్ బుధవారం ప్రారంభించారు. భవిత కేంద్రం పరిధిలో మొత్తం ఎందరు దివ్యాంగులు ఉన్నారు? ఏ ఏ సేవలు వారికి అందిస్తారో ఆరా తీశారు. అనంతరం కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ... ఎల్లారెడ్డిపేట మండలకేంద్రంలో భవిత కేంద్రం అందుబాటులోకి వచ్చిందని తెలిపారు. దీని సేవలను దివ్యాంగ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ప్రతి బుధవారం, గురువారం ఐఈఆర్పీ, ఫిజియోథెరపిస్ట్ సేవలు అందుబాటులో ఉంటాయని వెల్లడించారు. అనంతరం మండల సమాఖ్య భవనాన్ని పరిశీలించి, ఎందరు సభ్యులు ఉన్నారని, స్వయం ఉపాధి, సంఘాల ఆర్థిక కార్యకలాపాలపైన ఆరా తీశారు. అక్కడి నుంచి జూనియర్ కళాశాల మైదానంలో పనులను పరిశీలించి.. అధికారులకు పలు సూచనలు చేశారు.కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ సబేరా బేగం, జిల్లా విద్యాధికారి జగన్ మోహన్ రెడ్డి, మండల ప్రత్యేక అధికారి అఫ్జల్ బేగం, తహసీల్దార్ సుజాత, ఎంపీడీఓ సత్తయ్య, ఎంఈవో కృష్ణహరి, తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేద కుటుంబానికి ఆర్థిక సహాయం



**టీ మీడియా, మార్చి 25, రామకృష్ణాపూర్ ;**క్యాతనపల్లి మున్సిపాలిటీ రామకృష్ణాపూర్ పట్టణంలోని అల్లూరి సీతారామరాజు నగర్ ఒకటో వార్డుకు చెందిన సుర చేన్నమల్లు నిరుపేద కుటుంబానికి చెందినవారు చనిపోవడం జరిగింది. వారి కుటుంబానికి అండగా మేమున్నామంటూ ఒకటవ వార్డు యువత,వార్డు ప్రజలు సహాయం చేయడానికి ముందుకు వచ్చి బుధవారం ఆర్థిక సహాయంగా 20000 రూపాయలను నిరుపేద కుటుంబానికి అందించడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఆశనవేణి సత్యనారాయణ, పోగుల మల్లయ్య ,పిల్లి సతీష్, ముక్తి శ్రీనివాస్ ,మేకల కుమారస్వామి, భుక్య బాలాజీ, ఇతరులు పాల్గొన్నారు.




## ధ్వజస్థంభ ప్రతిష్ఠ, కల్యాణ మహోత్సవం

**టీ మీడియా, మార్చి 25, పెబ్బేరు (వనపర్తి జిల్లా):**పెబ్బేరు మున్సిపాలిటీ పరిధిలోని పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయంలో పునఃప్రతిష్ఠ మహోత్సవాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోనే మొట్టమొదటి ఆలయంగా పేరుగాంచిన ఈ దేవాలయంలో పాత గర్భాలయాన్ని పునర్నిర్మించి నూతనంగా విగ్రహ ప్రతిష్ఠలు చేపట్టారు.ఈ సందర్భంగా కాశీ విశ్వేశ్వర లింగం, గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్ర స్వాములు, మహాకాళికాదేవి, గాయత్రి సమేత విశ్వకర్మ, నాగదేవత విగ్రహాలను ప్రతిష్ఠించారు. అలాగే ధ్వజస్థంభ ప్రతిష్ఠ మహోత్సవాన్ని కూడా నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ, పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి విశ్వబ్రాహ్మణులకే కాకుండా సమస్త ప్రపంచానికి దైవస్వరూపమని పేర్కొన్నారు. ఈ ఆలయంలో గాయత్రి సమేత విశ్వకర్మ, కాశీ విశ్వేశ్వర లింగం, మహాకాళికాదేవి విగ్రహాల ప్రతిష్ఠ పెబ్బేరు పట్టణానికి శుభ సూచికమని తెలిపారు.విగ్రహ ప్రతిష్ఠల అనంతరం పూర్ణాహుతి, మహానివేదన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి కళ్యాణ మహోత్సవం జరిగింది. మహామంగళహారతి తర్వాత భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక ప్రముఖులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## అక్రమ కల్లు వ్యాపారం అరికట్టాలి



**టీ మీడియా, మార్చి 25, ఆత్మకూర్:**వనపర్తి జిల్లా ఆత్మకూర్ మున్సిపల్ కేంద్రంలో అక్రమ కల్లు వ్యాపారం జరుగుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ మేరకు కల్లుగీత సొసైటీ సభ్యులు జిల్లా జాయింట్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.సొసైటీ సభ్యుల ప్రకారం, అనిల్ గౌడ్ అనే వ్యక్తి నిబంధనలకు విరుద్ధంగా కల్లు వ్యాపారం నిర్వహిస్తున్నాడని పేర్కొన్నారు. ఇది సొసైటీ హక్కులకు భంగం కలిగించే చర్య అని వారు తెలిపారు.అక్రమంగా విక్రయిస్తున్న కల్లు వల్ల ప్రజల ప్రాణాలకు ప్రమాదం కలుగొచ్చని సొసైటీ సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. నాణ్యతలేని కల్లు కారణంగా ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని పేర్కొన్నారు.మార్చి 2026 నుంచి మార్చి 2027 వరకు కల్లు వ్యాపారం సొసైటీ సభ్యులే నిర్వహించాలనే తీర్మాన పత్రాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్‌కు అందజేశారు. ఈ విషయాన్ని జిల్లా ఎక్సైజ్ సీఐ దృష్టికి కూడా తీసుకెళ్లినట్లు తెలిపారు.అక్రమ వ్యాపారంపై కఠిన చర్యలు తీసుకోవాలని, వెంటనే అక్రమ కల్లు విక్రయాలను అరికట్టాలని, కల్లుగీత సొసైటీ సభ్యులకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు.ఆత్మకూర్ మున్సిపాలిటీ కేంద్రంలో ఈ అంశం తీవ్ర చర్చకు దారితీసింది. ప్రజల ప్రాణ భద్రత దృష్ట్యా అధికారులు తక్షణమే స్పందించాలని స్థానికులు కోరుతున్నారు

## మెగా హెల్త్ క్యాంప్‌ను తనిఖీ చేసిన -జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్



**టి మీడియా, మార్చి 25, వెల్గటూర్:**రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న '100 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక'లో భాగంగా వెల్గటూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం నిర్వహించిన మెగా వైద్య శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. భారీ సంఖ్యలో గ్రామీణ ప్రజలు శిబిరానికి తరలివచ్చి వైద్య సేవలను పొందారు.ఈ ఉచిత వైద్య శిబిరాన్ని స్థానిక సర్పంచ్ బండమీది కవిత రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి సుజాత, డిప్యూటీ డీఎంహెచ్ఓ శ్రీనివాస్ శిబిరాన్ని సందర్శించి, రోగులకు అందుతున్న వైద్య సేవలు, ఉచిత మందుల పంపిణీ విధానాన్ని సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంత ప్రజలకు అత్యున్నత ప్రమాణాలతో నాణ్యమైన వైద్య సేవలను అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. వైద్య సిబ్బంది విధుల్లో అలసత్వం లేకుండా, సమయపాలన పాటిస్తూ బాధ్యతాయుతంగా సేవలు అందించాలని సూచించారు.డాక్టర్ తేజశ్రీ పర్యవేక్షణలో నిర్వహించిన ఈ శిబిరంలో గైనకాలజీ నిపుణురాలు డా. భారతి రాణి, పీడియాట్రిషన్ డా. పూర్ణచందర్, ఆర్థోపెడిక్ నిపుణుడు డా. భరత్, నేత్ర వైద్య నిపుణురాలు డా. సుజాత, దంత వైద్యురాలు డా. లావణ్య, జనరల్ మెడిసిన్ వైద్యుడు డా. ఇమ్తియాజ్ అలీ తదితరులు పాల్గొని రోగులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. అదనంగా సీజనల్ వ్యాధుల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు శైలేందర్ రెడ్డి, సర్పంచ్ బండమీది కవిత, మాజీ ఉప సర్పంచ్ సందీప్ రెడ్డి, ఏఎంసీ వైస్ ప్రెసిడెంట్, స్థానిక ప్రజా ప్రతినిధులు, వైద్య సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రజా సంఘాల నేతలకు వినతి పత్రం



**టీ మీడియా , మార్చి 25 , వనపర్తి, :**వనపర్తి జిల్లా సమస్యల పరిష్కారానికి అఖిలపక్ష ఐక్యవేదిక, గొల్లపల్లి-చీర్కపల్లి రిజర్వాయర్ వ్యతిరేక కమిటీ రాష్ట్ర ప్రజా సంఘాల నేతలను కలిసి వినతి పత్రం సమర్పించింది.హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో రాష్ట్ర ప్రజా సంఘాల నేతలు పృథ్వీరాజు యాదవ్, తెలంగాణ విఠల్, విమలక్కలను కలిసి జిల్లా సమస్యలపై చర్చించారు. ముఖ్యంగా గొల్లపల్లి-చీర్కపల్లి రిజర్వాయర్ అంశంపై వివరించి, స్థానిక ప్రజల ఆందోళనలను వారికి తెలియజేశారు.అలాగే త్వరలో నిర్వహించనున్న రౌండ్ టేబుల్ సమావేశానికి హాజరుకావాలని నేతలను ఆహ్వానించగా, వారు సమ్మతించినట్లు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో డా. సతీష్ యాదవ్‌తో పాటు బీఎస్పీ ఎమ్మెల్యే అభ్యర్థి మై బూస్, మాజీ జెడ్పిటిసి చంద్రశేఖర్ నాయక్, గోపాల్ రావు, దొడ్ల రాములు, మద్గం రమేష్, సునిల్ కుమార్, మహమూద్, జమ్మి శేషయ్య, తలారి కుర్మయ్య, బొగ్గు వెంకటేష్, బోయ రాములు, జూపల్లి కుమార్ రావు, దౌడ రాజు దానయ్య, జూపల్లి భాస్కర్ రావు, గనేష్, బొగ్గు సలేశ్వరం, జెట్టి రాములు, రామచంద్రయ్య, మహేష్, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

## లొంగిపోయిన మావోయిస్టు అగ్రనేత పాపారావు



**టి మీడియా, మార్చి 25 ,రాయ్‌పూర్:** ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టు సంస్థకు చెందిన అగ్ర నాయకుడు పాపారావుతో సహా మొత్తం 18 మంది మావోయిస్టులు బుధవారం నాడు ఛత్తీస్‌గఢ్ ఉప ముఖ్యమంత్రి విజయ శర్మ ఎదుట లొంగిపోయారు. ఆయుధాలు విడిచిపెట్టి లొంగిపోయిన వారిలో ఏడుగురు మహిళలు ఉన్నారు. పాపారావు మావోయిస్టు సంస్థ రాష్ట్ర జోనల్ కమిటీ సభ్యుడిగా పనిచేశారు. దండకారణ్య ప్రాంతానికి చెందిన మోస్ట్ వాంటెడ్ పాపారావుపై రూ.2 కోట్ల రివార్డు. అనేక హింసాత్మక ఘటనలకు పాపారావు సూత్రధారిగా ఉన్నారు. దండకారణ్యంలో మావోయిస్టు సంస్థ విస్తరణలో పాపారావు కీలక పాత్ర పోషించారు. బస్తర్ ప్రాంతపు డివిజనల్ కేంద్రమైన జగదల్‌పూర్‌లో ఏర్పాటు చేసిన ఒక కార్యక్రమంలో ఈ మావోయిస్టులు లొంగిపోయారు. లొంగిపోయే సమయంలో వారు ఎనిమిది ఏకే-47 రైఫిల్స్, ఒక సెల్ఫ్-లోడింగ్ రైఫిల్, ఒక బారెల్ గ్రెనేడ్ లాంచర్‌తో పాటు ఇతర ఆయుధాలను అధికారులకు అప్పగించారు. కాగా ఆపరేషన్ కగార్ క్లైమాక్స్ స్టేజ్ కి చేరింది. దేశవ్యాప్తంగా ఇప్పటి వరకు ఎంత మంది మావోయిస్టులు సరెండర్ అయ్యారు. డెడ్ లైన్ లోపు మిగిలినవాళ్లు దొరక్కపోతే ఏంటీ పరిస్థితి అన్న ప్రశ్న అందరిలో మెదులుతోంది. మరో ఆరో రోజుల్లో మావోయిస్టులకు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ ఇచ్చిన డైడ్ లైన్ ముగియనుంది.

## మృతురాలి కుటుంబానికి - మేఘన్న' చేయూత చైర్మన్




**టీ మీడియా, మార్చి 25, పెబ్బేరు :**పెబ్బేరు మున్సిపాలిటీ పరిధిలోని 10వ వార్డుకు చెందిన తెలుగు రేగడ్డ చింతలమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్ ఆమె పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.అనంతరం మృతురాలి కుటుంబ సభ్యులకు 'మేఘన్న భరోసా' పథకం కింద రూ. 5,000 ఆర్థిక సహాయం అందజేసి, కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటేశ్ సాగర్, మాజీ సర్పంచ్ సురేందర్ గౌడ్, రాములు యాదవ్, మార్కెట్ డైరెక్టర్ రామన్ గౌడ్, రణధీర్ రెడ్డి, కురుమూర్తి, వినయ్ తదితరులు పాల్గొన్నారు.



## ఆలయానికి కౌన్సిలర్ విరాళం

**టీ మీడియా, మార్చి 25,పెబ్బేరు:**పెబ్బేరు పట్టణంలో పోతులూరి వీర బ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠా ఉత్సవాలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమంలో 4వ వార్డు కౌన్సిలర్ దాసరి జమ్ములమ్మ పాల్గొన్నారు. ఆమె గుడికి తన వంతు సహాయంగా రూ.25,000లను ఆలయ కమిటీ సభ్యులకు అందించారుఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు కౌన్సిలర్ దాసరి జమ్ములమ్మకు ప్రత్యేక అర్చన నిర్వహించి, శాలువాతో సన్మానం చేశారు. అదేవిధంగా భక్తుల కోసం అన్నదాన కార్యక్రమాన్ని కూడా ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో దాసరి చిన్న రాములు, అయ్యప్ప గుడి ఆలయ పూజారి గోపి, కమిటీ సభ్యులు మరియు పట్టణ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## వ్యాక్సిన్ కేంద్రములో తనిఖీ

**టీ మీడియా ,మార్చి 25 ,పెబ్బేరు:** పెబ్బేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో ఉన్న ఆరోగ్య ఉప కేంద్రము లో వ్యాధినిరోధకాల టీకా కేంద్రం ను సందర్శించిన గీతాదేవి జిల్లా కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ యశోదా జిల్లా హెల్త్ ఎడ్యుకేటర్ ఆఫీసర్ మాట్లాడుతూ అప్పుడే పుట్టిన బిడ్డ నుండి ఐదు సంవత్సర పిల్లలందరికీ వ్యాధి నిరోధక టీకాలు వేయాలి మరియు వారికి ఇచ్చిన టీకా గురించి చెప్పి మళ్ళీ ఎప్పుడూ రావాలో చెప్పాలని అక్కడ ఉన్న సిబ్బందికి తెలియ చేస్తూ అలాగే యువిన్ ఎం సి హెచ్ కిట్టు లో కూడా అప్డేట్ చేయాలి ఎన్ సి డి కూడా తొందరగా అప్డేట్ చేయాలి ఇప్పుడు ఉన్న పరిస్థితుల్లో ఎండలు అధికంగా ఉండడం వల్ల ప్రజలు ఎండా బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రతి ఆశా కార్యకర్త ప్రజలకు అవగాహన పరచాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పబ్లిక్ హెల్త్ నర్స్ లీలమ్మ హెల్త్ సూపర్వైజర్ పార్వతి స్వరూపరాణి హెల్త్ అసిస్టెంట్ రాజశేఖర్ నర్సింగ్ ఆఫీసర్ కృష్ణ డాటా ఎంట్రీ ఆపరేటర్ రాజేష్ గౌడ్ ఏ ఏన్ ఎం శారద ఆశ కార్యకర్త లు పాల్గొన్నారు.

# మత సామరస్యానికి ప్రతీకగా మూసీ



- ఓంకారేశ్వర మందిర నిర్మాణానికి ప్రణాళికలు
- 28న శంకుస్థాపన చేయనున్న సీఎం రేవంత్‌రెడ్డి



**టి మీడియా, మార్చి 25 , హైదరాబాద్ బ్యూరో** :మూసీ నది పరివాహక ప్రాంతాన్ని మత సామరస్యానికి ప్రతీకగా నిలిపేందుకు తెలంగాణ ప్రభుత్వం అడుగులు వేస్తోంది. దీనికోసం రాష్ట్ర ప్రభుత్వం భారీ శివాలయ నిర్మాణ పనుల ప్రాజెక్టు శ్రీకారం చుట్టనుంది. ఈ నిర్మాణంలో భాగంగా గండిపేట మండలం మంచిరేవుల గ్రామ పరిధిలోని 800 ఏళ్ల చరిత్ర కలిగిన వీరభద్రస్వామి ఆలయాన్ని, 1400 సంవత్సరాల నాటి మచిలేశ్వర ఆలయం వద్ద నూతనంగా ఓంకారేశ్వర మందిరాన్ని నిర్మించేందుకు ప్రణాళిక రూపొందించింది.ఆలయ నిర్మాణశైలి ఖరారు చేసేందుకు కర్ణాటకలోని శృంగేరి శారదాపీఠం జగద్గురువుల సలహాలు, సూచనలు తీసుకున్నారు. ఈ ఆలయ నిర్మాణ పనులకు వీరభద్రస్వామి దేవాలయ ప్రాంతంలో ఈ నెల 28న ఉదయం 8.30 గంటలకు సీఎం రేవంత్?రెడ్డి శంకుస్థాపన చేయనున్నారు. ఈ కార్యక్రమంలో శృంగేరిపీఠం ముఖ్య ప్రతినిధులు పాల్గొంటారు. వివరాల్లోకి వెళితే,

### అభివృద్ధికి తొలి మెట్టు

హైదరాబాద్? నగరానికి పశ్చిమాన ఉన్న జంట జలాశయాల నుంచి తూర్పున ప్రతాపసింగారం వరకు హైదరాబాద్? నగరంలో సుమారు 55 కిలోమీటర్ల పొడవున మూసీ నది ప్రవహిస్తోంది. ఈ పరిధిలోనే దేశంలోని నాలుగు ప్రధాన మతాలకు సంబంధించిన ప్రార్ధనా మందిరాలను నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. వీటికి సంబంధించిన నిర్మాణాలు మత సామరస్యానికి ప్రతీకగా నిలపాలని లక్ష్యంగా పెట్టుకుంది. మంచిరేవులలోని పురాతన వీరభద్రస్వామి ఆలయాన్ని అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. దీనితో పాటు నాగోల్?లో చర్చి నిర్మాణం చేపట్టాలని, పురానాపూల్? వద్ద భారీ మసీదు నిర్మించాలని, గౌలిగూడ వద్ద గురుద్వారా కట్టాలని ప్రణాళికలు సిద్ధం చేసింది. జంట జలాశయాల నుంచి బాపూఘాట్? వరకు త్వరలో చేపట్టనున్న మూసీ తొలిదశ అభివృద్ధి పనులను చేపట్టనున్న విషయం తెలిసిందే. వీటిని ఓంకారేశ్వర ఆలయ నిర్మాణానికి శంకుస్థాపనతో ప్రారంభించబోతున్నారు.

చరిత్రాత్మక మందిరాలు నిర్మాణం

గండిపేట జలాశయానికి దిగువన గుట్టపై ఉన్న వీరభద్రస్వామి దేవాలయం కాకతీయుల కాలంలో నిర్మించారు. దీనికి సమీపంలో ఉన్న మచిలేశ్వర శివలింగాన్ని చాళుక్యులు ప్రతిష్ఠించారని ఆలయ నిర్వహకులు పరమేశ్వర్? వెల్లడించారు. ఈ దేవాలయాలను పునరుద్ధరించడంతో పాటు దీనికి సమీపంలో 8 ఎకరాల విస్తీర్ణంలో ఓంకారేశ్వర ఆలయాన్ని నిర్మించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది.

### రెండో అతిపెద్ద గర్బాలయం

ఈ నూతన ఆలయ నిర్ణాణంలో ఎత్తయిన గాలి గోపురాన్ని నిర్మించనున్నారు. దీనిలో నుంచి లోపలికి వెళితే వేర్వేరు మండపాలు దర్శనమిస్తాయి. అక్కడి నుంచి లేపలికి వెళితే ఓంకారేశ్వర మందిరం ఉంటుంది. దీనిలోని గర్భాలయ గోపురాన్ని 64 అడుగులు ఎత్తు, 14 అడుగులు పొడవు, 14 అడుగుల వెడల్పుతో నిర్మించనున్నారు. తెలంగాణలో యాదగిరిగుట్ట గర్భాలయం తర్వాత ఓంకారేశ్వర స్వామి గర్భాలయమే పెద్దగా ఉండబోతుందని ప్రభుత్వం చెబుతోంది.

### దాతలు, ప్రైవేటు సంస్థల భాగస్వామ్యంతో

ప్రాజెక్టుకు రూ.700 కోట్ల వ్యయం అవుతుందని ప్రభుత్వం అంచనా వేస్తోంది. మూసీ నది అభివృద్ధి మొదటిదశలో ఆలయ నిర్మాణం భాగమని, వ్యయంలో దాతలు, ప్రైవేటు సంస్థలను భాగస్వామ్యం చేస్తామని ప్రభుత్వం అంటోంది. దీనిని పర్యాటకులు భక్తులు చేరుకునేందుకు వీలుగా ఓఆర్?ఆర్? నుంచి ఈ మందిరానికి విశాలమైన రోడ్డు మార్గాన్ని నిర్మించేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోంది. ఆలయం వద్ద వెయ్యి నుంచి 2 వేల వాహనాలకు పార్కింగ్? వసతి కల్పిస్తామని పేర్కొంది. దిగువనున్న మూసీపై చిన్నపాటి ఆనకట్టను కట్టి నీటిని నిల్వ ఉంచే విధంగా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపింది. అక్కడ నది మధ్యలో దీనిపై నిల్చున్న 100 అడుగుల శివుని విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొంది. చుట్టూ పార్కులను అభివృద్ధి చేసి, బోటింగ్?, ఇతర సౌకర్యాలను కల్పిస్తామని ప్రభుత్వం వెల్లడించింది.

---

## ముమ్మరంగా పోలీసుల తనిఖీలు



**టీ మీడియా ,మార్చి 25 ,ఆత్మకూరు** :ఆత్మకూరు మండల కేంద్రంలో ని జూరాల క్రాస్ రోడ్ వద్ద ఎస్సై జయన్న ఆధ్వర్యంలో పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు.త్రిబుల్ రైడింగ్, మైనర్ల కు వాహనాలు ఇవ్వవద్దని మద్యం తాగి వాహనాలు నడపవద్దని అలాగే నడిపే వారిని తనిఖీ చేస్తూ వాహనానికి సంబంధించిన పత్రాలు చూస్తూ వారికి అవగాహన కల్పించారు.

## భారత యువజన క్రీడా సర్వీసులో

**-ఉపన్యాస పోటీలు**




**టీ మీడియా ,మార్చి 25 ,పెబ్బేరు** :పెబ్బేరు పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భారత యువజన క్రీడా సర్వీసులు వారి ఆధ్వర్యంలో జిల్లా స్థాయి ఉపన్యాస పోటీలు నిర్వహించడం జరిగినది .ఈ కార్యక్రమంలో జిల్లాలోని వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు హాజరై ఉపన్యసించడం జరిగినది ఈ పోటీలలో మొదటి ఐదు స్థానాలలో నిలిచిన విద్యార్థులు మార్చి 27 ,28 న హైదరాబాద్ లో జరగబోయే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కాబడ్డారు ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఏ వెంకట ప్రసాద్ ,యువజన క్రీడా సర్వీసులు ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా కోఆర్డినేటర్ కోటా నాయక్ ,పెబ్బేరు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ విజయ వర్ధన్ రెడ్డి ,పాల్గొని గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రశంసా పత్రాలు అందజేయడం జరిగినది .ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది డా బి నరసయ్య ఎండి ఆరీఫ్ విద్యార్థులు పాల్గొనడం జరిగినది.

## మల్కాపూర్‌లో సీసీ రోడ్డు పనుల ప్రారంభం



**టీ మీడియా, మార్చి 25, టేక్మాల్ ప్రతినిధి**:మెదక్ జిల్లా టేక్మాల్ మండలంలోని మల్కాపూర్ గ్రామ అభివృద్ధిలో భాగంగా ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను సర్పంచ్ వెంకటకృష్ణ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్తుల సౌకర్యార్థం నాణ్యమైన రహదారులను నిర్మిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గణేష్, వార్డు సభ్యులు అనిత, మాధవి, మౌనికలతో పాటు మాజీ సర్పంచ్ హన్సిబాయి పాండ్య నాయక్ పాల్గొన్నారు. అలాగే గ్రామ పెద్దలు వీరగౌడ్, దన్‌సింగ్, రూప్‌సింగ్, శంకర్, వినోద్, సుదర్శన్, జీవన్, బన్సీలాల్, సురేష్, రాఘవులు, చందర్, రాజు, కిషన్ మరియు పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

## తోమాలపల్లి లో కబడ్డీ పోటీలు

**-- బహుమతుల ప్రదానం**



**టీ మీడియా, మార్చి 25, పెబ్బేరు (బుధవారం):** పెబ్బేరు మండల పరిధిలోని తోమాలపల్లి గ్రామంలో శ్రీరామనవమి సందర్భంగా ఆల్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన కబడ్డీ పోటీలు ఘనంగా ముగిశాయి.
ఈ పోటీల ఫైనల్లో కానాయపల్లి మరియు సుగూరు జట్లు తలపడ్డాయి. ఉత్కంఠభరితంగా జరిగిన ఈ మ్యాచ్‌లో సుగూరు జట్టు విజయం సాధించింది. విజేతగా నిలిచిన సుగూరు జట్టుకు మొదటి బహుమతిగా షీల్డ్‌తో పాటు రూ. 8,000 నగదు అందజేశారు. రెండవ స్థానంలో నిలిచిన కానాయపల్లి జట్టుకు షీల్డ్‌తో పాటు రూ. 5,000 నగదు బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ యువకులు, పెద్దలు పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు.

## సోషల్ మీడియా కోఆర్డినేటర్గా నియామకం



**టీ మీడియా, మార్చి 25, వనపర్తి బ్యూరో :** హైదరాబాద్ గాంధీభవన్ లో రాష్ట్ర సోషల్ మీడియా జనరల్ సెక్రెటరీ వినయ్ వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కో ఆర్డినేటర్ల ను నియమించి , ఐడి కార్డులను, డైరీలను ఇచ్చారు. వనపర్తి జిల్లా పెద్దమందడి మండల్ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ గా గట్టు రాజు ను రెండోసారి నియమించారు.
పెద్దమందడి మండల సోషల్ మీడియా కోఆర్డినేటర్ గా గట్టు రాజును నియమించినందుకు రాష్ట్ర సోషల్ మీడియా జనరల్ సెక్రెటరీ కోఆర్డినేటర్ వినయ్ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా వేదికగా ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేర్చి కాంగ్రెస్ పార్టీ ని బలోపేతం చేయడానికి కృషి చేస్తా అని అన్నారు. ప్రతిపక్ష పార్టీలు బిజెపి, బిఆర్ఎస్ పార్టీలు చేసే విమర్శలను సున్నితంగా ఎదుర్కొని సమాధానం ఇచ్చి ప్రజాస్వామ్య వ్యవస్థను కాపాడుతానని అన్నారు. పార్టీ మాపై నమ్మకం ఉంచి అవకాశం కల్పించినందుకు పార్టీ నమ్మకాన్ని నిలబెట్టు కుంటానని అన్నారు. పెద్దమందడి మండల్ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ గా నియమించేందుకు సహకరించిన వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొత్త కాపు శివసేనారెడ్డికి,రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు జిల్లెల చిన్నారెడ్డికి , వనపర్తి నియోజకవర్గ శాసన సభ్యులు తూడి మెగారెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## కాంగ్రెస్ పార్టీకి మాజీ మంత్రి జీవన్ రెడ్డి రాజీనామా



**టి మీడియా, మార్చి 25 , హైదరాబాద్ బ్యూరో**:కాంగ్రెస్ పార్టీకి మాజీ మంత్రి, సీనియర్ నేత జీవన్ రెడ్డి గుడ్‌బై చెప్పారు. పార్టీకి రాజీనామా చేస్తున్న ఆయన ప్రకటించారు. ఈ సందర్భంగా మాజీమంత్రి జీవన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. కొంతమంది తనకు ఏ గుర్తింపు లేకుండా అణగదొక్కాలని చూస్తున్నారని ఆరోపించారు. జగిత్యాలలో తన ఉనికి ఉండకూడదని కుట్ర చేస్తున్నారని మండిపడ్డారు. తనక పోరాటం కొత్త కాదని.. చంద్రబాబు, కేసీఆర్‌తో పోరాడానని తెలిపారు. ఇప్పుడు సీఎం రేవంత్‌తో పోరాటానికి కూడా సిద్ధమే అని ప్రకటించారు.అయితే రాజీనామాకు ముందు ఆయన కొన్ని వ్యాఖ్యలు చేశారు. తొలుత తనకు పార్టీ మారాలనే ఆలోచన లేదన్నారు జీవన్ రెడ్డి.. ఈ వయసులో పార్టీ మారి ఏం చేయగలనని చెప్పారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలు పార్టీలో తలదూర్చకుండా చూడాలని కోరాను.. ఇదే విషయాన్ని టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్‌కు స్పష్టం చేశానని వివరించారు. కానీ అందరం కలిసి పనిచేద్దామని బుజ్జగించే ప్రయత్నం చేశారన్నారు. ఓపిక పట్టాలని కోరారని.. ఇంకా ఎంతకాలం ఓపిక పట్టాలని అన్నారు.

## కాంగ్రెస్‌కు కేంద్రం నోటీసు

### అక్బర్ రోడ్ కార్యాలయం ఖాళీ చేయాలని ఆదేశం



**టి మీడియా, మార్చి 25 , ఢిల్లీ బ్యూరో :** కేంద్ర ప్రభుత్వ ఎస్టేట్ శాఖ బుధవారం కాంగ్రెస్ పార్టీకి కీలక నోటీసు జారీ చేసింది. ఢిల్లీలోని 24, అక్బర్ రోడ్‌లో ఉన్న పార్టీ కార్యాలయాన్ని ఈ నెల 28లోగా ఖాళీ చేయాలని ఆదేశించింది. ఈ విషయాన్ని కాంగ్రెస్ వర్గాలు వెల్లడించాయి. దాదాపు 48 సంవత్సరాలుగా ఆ బంగ్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయంగా కొనసాగుతోంది. కానీ ఇప్పుడు ఖాళీ చేయాలని ఎస్టేట్ శాఖ ఆదేశించడం గమనార్హం.నిజానికి అయితే గత సంవత్సరం కాంగ్రెస్ పార్టీ తన కొత్త కార్యాలయం ఇందిరా భవన్?ను కొట్లా మార్గ్‌లో ప్రారంభించింది. అధికారికంగా కార్యకలాపాలు అక్కడికి మార్చినప్పటికీ, ఇప్పటికీ అక్బర్ రోడ్ కార్యాలయంలోనే అనేక పార్టీ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. దీంతో ఎస్టేట్ శాఖ చర్యలు తీసుకున్నట్లు సమాచారం. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నోటీసుపై కాంగ్రెస్ నేతలు స్పందించే అవకాశముంది. పార్టీకి చెందిన కీలక సమావేశాలు, మీడియా బ్రీఫింగ్స్, రాజకీయ చర్చలు ఇప్పటికీ అక్బర్ రోడ్ భవనంలోనే జరుగుతున్నాయి. దీంతో ఈ నోటీసు రాజకీయంగా కూడా ప్రాధాన్యం సంతరించుకుంది.

### చట్టాన్ని సవరించే ప్రయత్నం

అదే సమయంలో కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ముఖ్యంగా నారీ శక్తి వందన్ చట్టంపై కేంద్రం తీసుకుంటున్న నిర్ణయాలను ఆయన ప్రశ్నించారు. ఈ చట్టాన్ని సవరించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపిస్తూ, దీనిని వెపన్స్ ఆఫ్ మాస్ డైవర్షన్?గా అభివర్ణించారు. జైరాం రమేశ్ తన సోషల్ మీడియా వేదిక ఎక్స్?లో చేసిన పోస్టులో పలు అంశాలను ప్రస్తావించారు.2023లో నూతన పార్లమెంట్ భవన ప్రారంభ సమయంలో నారీ వందన్ అధినియం ఆమోదించబడిందని గుర్తుచేశారు. ఈ చట్టం ప్రకారం లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీలలో మహిళలకు మూడో వంతు రిజర్వేషన్లు కల్పిస్తారమని తెలిపారు. అయితే ఈ రిజర్వేషన్లు అమల్లోకి రావాలంటే ముందుగా జనగణన (సెన్సస్), నియోజకవర్గాల పునర్విభజన (డిలిమిటేషన్) పూర్తవ్వాల్సి ఉంటుందని అప్పట్లో కేంద్రం స్పష్టంగా చెప్పిందని రమేశ్ పేర్కొన్నారు.

### పూర్తిగా యూటర్న్


కాంగ్రెస్ పార్టీ అప్పుడే ఈ చట్టాన్ని 2024 లోక్‌సభ ఎన్నికల నుంచే అమలు చేయాలని డిమాండ్ చేసినా, కేంద్రం అది సాధ్యం కాదని చెప్పిందని ఆయన గుర్తు చేశారు. కానీ ఇప్పుడు అదే కేంద్ర ప్రభుత్వం డిలిమిటేషన్, సెన్సస్ పూర్తి కాకుండానే ఈ రిజర్వేషన్లు అమలు చేయాలని చూస్తోందని విమర్శించారు. ఇది పూర్తిగా యూటర్న్ అని జైరాం రమేశ్ అన్నారు.ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం మహిళల రిజర్వేషన్లను నిజంగా అమలు చేయాలన్న ఉద్దేశంతో కాకుండా, దేశంలో ఉన్న ఇతర ముఖ్య సమస్యల నుండి ప్రజల దృష్టిని మళ్లించేందుకే ఈ అంశాన్ని ఉపయోగిస్తోందని ఆరోపించారు. దేశంలో ప్రస్తుతం ఎల్పీజీ ధరలు, ఇంధన సమస్యలు, అలాగే పశ్చిమ ఆసియా సంక్షోభం వంటి అంశాలు ప్రజలను ఆందోళనకు గురిచేస్తున్నాయని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రజల దృష్టిని మళ్లించేందుకు ప్రభుత్వం నారీ శక్తి వందన్ చట్టాన్ని ఉపయోగిస్తోందని విమర్శించారు.

### సోనియాకు అస్వస్థత

కాగా, కాంగ్రెస్ అగ్రనాయకురాలు, రాజ్యసభ ఎంపీ సోనియా గాంధీ మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత అస్వస్థతకు గురయ్యారు. దీంతో ఆమెను వెంటనే ఢిల్లీలోని సర్ గంగారామ్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె చికిత్స పొందుతున్నారని, వైద్యుల బృందం ఆమె ఆరోగ్య పరిస్థితిని నిశితంగా పర్యవేక్షిస్తోందని ఆస్పత్రి వర్గాలు వెల్లడించాయి. సోనియా గాంధీ గత కొంతకాలంగా శ్వాసకోశ సంబంధిత సమస్యలతో బాధపడుతున్నారు. గత జనవరిలో కూడా ఆమె ఇదే ఆస్పత్రిలో చేరారు. అప్పట్లో ఢిల్లీలో పెరిగిన కాలుష్యం, తీవ్రమైన చలి కారణంగా ఆమెకు ఆస్తమా సమస్య తీవ్రమైందని వైద్యులు తెలిపారు. ఆ సమయంలో ఆమెకు యాంటీబయోటిక్స్‌తో కూడిన చికిత్స అందించగా, పరిస్థితి నిలకడగా ఉండటంతో డిశ్చార్జ్ చేశారు. తాజాగా మరోసారి ఆమె ఆస్పత్రిలో చేరడంతో కాంగ్రెస్ శ్రేణుల్లో ఆందోళన నెలకొంది.

## అన్నీ వృత్తులకన్న ఉపాధ్యాయ వృత్తి గొప్పది

### పలుస శంకర్ గౌడ్ సాహితీ కళా వేదిక అధ్యక్షులు



**టీ మీడియా, మార్చి 25, వనపర్తి బ్యూరో :** అప్పర్ ప్రైమరీ స్కూల్ ఇప్పల్లపల్లి మహబూబ్‌నగర్ రూరల్, మండలం స్కూల్లో స్కూల్ అసిస్టెంట్ గా పనిచేసి బుధవారం రిటైర్డ్ చేస్తున్న గీతారాణి రిటైర్మెంట్ ఫంక్షన్ లో శంకర్ గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా శంకర్ గౌడ్ మాట్లాడుతూ అన్నీ వృత్తులకన్న కన్న ఉపాధ్యాయ వృత్తి గొప్పది అన్నారు. 40 ఏళ్లుగా ఉపాధ్యాయ వృత్తికి గీతారాణి సేవలు అందించారు అన్నారు. గీతారాణి రిటైర్డ్ అయిన తర్వాత సమాజా సేవలో పాల్గొన్నాలని కొరారు.ఈ కార్యక్రమంలో సభాధ్యశుడు వాగ్దేవి కార్యక్రమంలో ఎంఈవో కృష్ణయ్య, రాజాపూర్, ఎంఈఓ సుధాకర్, వివిధ ఉపాధ్యాయ సంఘాలు పాఠశాల చైర్మన్, లక్ష్మమ్మ కుటుంబ సభ్యులు, పాఠశాల ఉపాధ్యాయులు, మండల ఉపాధ్యాయులు, మిత్రులు, తదితరులు పాల్గొన్నారు.

## సొంత నిధులతో మహిళలకు కుట్టు ట్రైనింగ్




**టీ మీడియా, మార్చి 25, చిన్నచింతకుంట:**మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలను కల్పించాలనే లక్ష్యంతో దేవరకద్ర నియోజకవర్గంలోని చిన్నచింతకుంట మండలం దమగ్నాపూర్ గ్రామంలో కుట్టు మిషన్ టైలరింగ్ శిక్షణ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి సతీమణి శ్రీమతి కవిత మధుసూదన్ రెడ్డి తమ సొంత నిధులతో నిర్వహించడం విశేషం.ఈ శిక్షణ శిబిరం ద్వారా గ్రామంలోని మహిళలు కుట్టు పనిలో నైపుణ్యం సాధించి స్వయం ఉపాధి దిశగా ముందుకు సాగాలని నిర్వాహకులు ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే శ్రీమతి స్వర్ణ సుధాకర్ రెడ్డి, పేరూర్ గ్రామ సర్పంచ్ శ్రీమతి శృతి అరవింద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.వక్తలు మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా బలపడితే కుటుంబం, సమాజం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. ఈ తరహా శిక్షణ కార్యక్రమాలు మహిళల జీవితాల్లో మార్పు తీసుకువస్తాయని పేర్కొన్నారు.



## టెర్రర్ లింక్ కేసు

- మరొకరిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

**టి మీడియా, మార్చి 25 , విజయవాడ :** ఉగ్ర లింకుల కేసులో మరొకరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. హైదరాబాద్ చంచల్‌గూడలోని సయీదా బేగం నివాసంలో ఏపీ కౌంటర్ ఇంటెలిజెన్స్ పోలీసులు సోదాలు నిర్వహించారు. సోదాల అనంతరం సయీదా బేగంకు పోలీసులు 41ఏ నోటీసులు ఇచ్చి, అదుపులోకి తీసుకున్నారు. సయీదా బేగంను విజయవాడకు తరలించారు.టెర్రర్ లింక్ కేసులో హైదరాబాద్ మహిళను విజయవాడ కౌంటర్ ఇంటెలిజెన్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. హైదరాబాద్ పోలీసులకు సమాచారమిచ్చి నిందితురాలిని విజయవాడకు తీసుకువచ్చారు. రహస్య ప్రాంతంలో ఆమెను ప్రశ్నిస్తున్నారు. విచారణ పూర్తయ్యాక సయిదాను విజయవాడ కోర్టులో హాజరుపరిచే అవకాశం ఉంది.మహారాష్ట్రంలోని షోలాపూర్?కు చెందిన సయిదా బేగం చాలా ఏళ్లుగా హైదరాబాద్?లో ఉంటోంది. గతంలో అనుమానంతో తెలంగాణఇంటెలిజెన్స్ అధికారులు ఓసారి ఆమెను విచారణ చేశారు. అయినా ఏమాత్రం భయం లేకుండా సోషల్ మీడియాలో యాక్టివ్?గా ఉంటూ యువకుల్ని టెర్రరిజం వైపు మళ్లిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు.

### ఆమె వెనుక ఓ విదేశీ హ్యాండ్లర్

విజయవాడలోని వించిపేటలో రెండు రోజుల క్రితం అరెస్టయిన ముగ్గురు యువకులకు ఉగ్రవాద భావజాలం ఎక్కించడంలో సయిదా కీలకపాత్ర పోషించినట్లు పోలీసులు నిర్ధారణకు వచ్చారు. సుమారు ఏడాదిగా వారితో ఆన్?లైన్?లో కమ్యూనికేట్ అవుతున్నట్లు తేల్చారు. సయిదా బేగం వెనుక ఓ విదేశీ హ్యాండ్లర్ ఉన్నట్లు పోలీసు విచారణలో తేలింది. వీళ్లతో పాటు మొత్తం 12 మంది సభ్యుల గ్యాంగ్ ఆన్?లైన్?లో టచ్?లో ఉన్నట్లు పోలీసులు అంచనాకు వచ్చారు. వారిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేసి, 5 ప్రాంతాలకు పంపించారు.ఇప్పటికే ఈ కేసులో విజయవాడ ఉగ్ర లింకు కేసులో నిందితులు మహ్మద్ రెహ్మతుల్లా, మీర్జా సోహెల్, మహ్మద్ డానిష్?లను విజయవాడ సీఎంఎం కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం ఏప్రిల్ 6 వరకూ జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. దీంతో వారిని విజయవాడ కేంద్ర కారాగారానికి తరలించారు. విచారణ సందర్భంగా న్యాయవాదిని నియమించు కున్నారా? అని నిందితులను న్యాయమూర్తి ప్రశ్నించగా, తాము నియమించుకోలేమని తెలిపారు. ఈ విషయాన్ని రాత పూర్వకంగా కోర్టుకు ఇవ్వాలని న్యాయస్థానం పేర్కొంది. నిందితులకు రిమాండ్ విధిస్తూ న్యాయమూర్తి ఉత్తర్వులు ఇవ్వడంతో వారిని రాజమహేంద్రవరం కేంద్ర కారాగారానికి తరలించారు. పాకిస్థాన్?లోని హ్యాండ్లర్లతో సంబంధాలు ఏర్పరచుకొని సామాజిక మాధ్యమాల ద్వారా ఉగ్ర కార్యకలాపాలకు పాల్పడుతున్న ఈ ముగ్గురినీ విజయవాడ టూటౌన్ పోలీసులు అరెస్టు చేశారు. వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. ఇన్?స్టాగ్రామ్, టెలిగ్రామ్ సహా పలు సామాజిక మాధ్యమాల ద్వారా యువతను ఉగ్రవాద భావజాలం వైపు ఆకర్షిస్తున్నట్లు గుర్తించారు.ఉగ్రవాద రిక్రూట్?మెంట్, జిహాదీ కార్యకలాపాల కోసం అవసరమైన నిధులను వీరికి పాకిస్థాన్ హ్యాండర్లు సమకూరుస్తున్నట్లు నిఘా వర్గాలకు సమాచారం ఉంది. ఏపీలోనే కాకుండా దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన యువకులతో వీరు గ్రూప్?లను ఏర్పాటు చేసి, అందులో ఉగ్రవాద భావజాలాన్ని వ్యాప్తి చేస్తూ, వారు ఉగ్రవాదుల కోసం సన్నద్ధమయ్యేలా పురిగొల్పుతున్నట్లు విచారణలో తేలింది.

### యువతను తప్పుదారి పట్టిస్తూ

ఉగ్రవాద నెట్‌వర్క్‌లోని మిగతా వారి కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి. అంతర్జాతీయ ఉగ్రవాద సంస్థలు సామాజిక మాధ్యమాల్లో నిర్వహించే ఖాతాలు, వెబ్‌సైట్లు వంటి వాటిని యువత అనుసరించొద్దని పోలీసులు సూచిస్తున్నారు. ఇవి విద్వేషపూరిత భావజాలాన్ని ప్రేరేపించి దేశ స్థిరత్వాన్ని దెబ్బతీసేందుకు యత్నిస్తున్నాయని తెలిపారు. తల్లిదండ్రులు వారి పిల్లల ఆన్‌లైన్ కార్యకలాపాలపై నిఘా ఉంచాలని, సామాజిక మాధ్యమాల ద్వారా యువతను తప్పుదారి పట్టిస్తున్న దేశ ద్రోహ శక్తుల నుంచి దూరంగా ఉంచాలని సూచిస్తున్నారు.